# సుకన్య

సుకన్యకు భర్తను చూసినప్పుడల్లా ఆశ్చర్యం కలుగుతూనే ఉంది. ఆ ఆశ్చర్యంతోపాటు భర్తపైన ప్రేమ, భక్తికూడా పెరుగుతూనే ఉన్నాయి. నిరంతర తపోదీక్షతో ఆయన శరీరం కృశిస్తోంది. కాని, అతీతమైన తేజస్సు ఆయనను అంటిపెట్టుకుంటూనే ఉంది.

ధ్యానమగ్నుడైన చ్యవన మహర్షి వంక కంటి రెప్పపాటు లేకుండా చూస్తోంది సుకన్య. ఆమెకు తన బాల్యం ఒక్కసారి కళ్ళకు కట్టినట్లైంది.

ఆనాడు స్నేహితురాళ్ళతో వనవిహారానికి బయలుదేరింది సుకన్య. అక్కడ వాల్మీకంలో కనిపించినమెరుపులు ఆమెకి ఆశ్చర్యాన్ని కలిగించాయి. అవి ఎక్కడనుంచి వస్తున్నాయో తెలుసుకోవాలని, అవి మిణుగురులేమో అని ఆ పుట్ట తవ్వించింది. ఆ నిముషమే పుట్టలో ఉన్న తపోధనుడైన చ్యవనమహర్షి ఆగ్రహానికి గురి అయింది. బాల్యంలో అజ్ఞానంతో చేసిన అపచారం వల్ల ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయపడిన తండ్రి, చ్యవన మహర్షి కిచ్చి తన వివాహం జరిపించాడు. అయితే రాజకుమార్తె అయిన తను మహర్షి భార్య అయినందుకు ఏనాడూ చింతించలేదు సుకన్య తేజోరాశి అయిన భర్తవంకే చూస్తోంది.

తృప్తిగా, ఆనందంగా సుకన్య జీవితం గడిచిపోతున్నా అంతరంగంలో ఒక చిన్న కోరిక కదలాడుతుండేది అపుడపుడు. ఈ మహర్షికి తేజస్సుకు తోడు యౌవనం కూడా ఉన్నట్లయితే మరింత ఆనందమయ మయ్యేది తన జీవితం. యౌవనుడైన తన భర్తతో, తన జీవితం ఎంత మధురాతి మధురంగా ఉంటుందో ఊహించుకుంటూంటే ఆమె శరీరం పులకాంకితమైంది.

వసంతం ఆ ప్రాంత మంతా నిండి ప్రకృతి శోభను మరింత పెంచింది. ఆశ్రమ సమీపంలో ఉన్న కొలనుకి స్నానార్థమై బయలుదేరింది సుకన్య.

శీతలోదకాలు, వికసించిన పద్మాలు ఆమె కెంతో ఆనందాన్ని కలిగించాయి. చ్యవన మహర్షిని రూప యౌవనుణ్ణిగా ఊహించుకుంటూ, జలక్రీడలలో మునిగి తేలుతూ తన్మయత్వం చెందింది సుకన్య.

అంతలో ఆకాశ మార్గాన ఇరువురు యౌవనులు తననే గమనించటం చూసి, ఊహాలోకంలోంచి బయటపడి తత్తరపాటు చెందింది.

ఆమె సౌందర్యానికి విస్తుపోతున్నారు వారిరువురు. ఏ దేవతా స్త్రీ లోనూ కానరాని రూప సౌందర్య లావణ్యాలు ఆమెలో చూస్తున్న వారి మనసులు వశం తప్పుతున్నాయి.

గగనమార్గం నుంచి దిగి, ఆమెను సమీపించారిద్దరూ. "మేము అశ్వి దేవతలం. ఈ నిర్జరారణ్యంలో ఒంటరిగా ఎందుకున్నావు? నీ వివరాలు చెప్పు."

వారి మాటల్లో కుతూహలం తరుముకొస్తుంటే సుకన్య సిగ్గుతో తల వంచింది.

"శర్యాతి మహారాజు కుమార్తెను, తపోధనుడైన చ్యవన మహర్షి భార్యను" అంది తలవంచి.

"నీ లాంటి అపురూప సౌందర్య రాశి ఆ వృద్ధునికి భార్యగా ఉండటమా? యౌవనవంతు డొకణ్ణి వివాహం చేసుకుని, నీ యౌవనం సార్థకం చేసుకో."

వారామెను ఆపాద మస్తకం చూస్తూ మాట్లాడుతుంటే, ఆ మాటలు శూల్లాలా ఆమె మనసుని గాయపరిచాయి.

తన స్వభావ సౌశీల్యాలు తెలియక వారట్లా మాట్లాడుతున్నారని, తనని వారు అపార్థం చేసుకున్న విషయం వారికి తెలియపరచాలని నిశ్చయించుకుంది సుకన్య.

"నేను చ్యవన మహర్షి ధర్మపత్నినని చెప్పాను. ఆయన ఎడ ఉన్న అవ్యాజానురాగం మీ లాటి వారికి అర్థం కాదు." సుకన్య ముఖంలో గంభీరత ఆవరించింది. ఆమె కళ్ళలో ఎరుపు నిండింది. ఆమె చూపులు నిశితమయ్యాయి.

"అయ్యా, నా భర్త చ్యవన మహర్షి అసమాన తేజోరాశి. అగ్ని దేవుణ్ణి శాసించిన భృగు మహర్షి పుత్రు డాయన. తల్లి గర్భం నుంచి వెలువడుతూనే పులోముడనే రాక్షసుణ్ణి దహించి వేసిన కోటి సూర్య ప్రభా భాసితుడు దైవ బల సంపన్నుడయిన చ్యవన మహర్షి భార్యగా నా జన్మ సార్థకమైంది. మీరు మాటలు చాలించి మరలిపొండి."

అశ్వి దేవతలకి భయమేసింది సుకన్య రూపాన్ని చూస్తుంటే. మహర్షి ఎడల సుకన్యకు గల ప్రేమను, మహర్షి శక్తియుక్తుల్ని పరీక్షించాలనే కోరిక వెంటనే కలిగింది.

"నీ మాటలు మాకు అర్థమయ్యాయి. కానీ అవి నిజమే నని నమ్మటానికి మే మొక మార్గం సూచిస్తున్నాము - శ్రద్ధగా విను. నీకూ, మహర్షికీ అంగీకార మైతేనే ఆ మాటలు చెప్తాము."

అశ్వి దేవతలు ఆమె వంకే చూస్తున్నారు. ఏమి చెప్తారో అని సుకన్య వారి వంకే చూస్తూ, తన అంగీకారం తెలిపింది.

"మేము అమర వైద్యులం. జరాభారాన్ని పోగొట్టే వైద్య రహస్యాలు మా వద్ద ఉన్నాయి. నీకు అంగీకారమైతే మహర్షి మాతోపాటు కొలనులో స్నానం చెయ్యాలి. అయనకి మాకున్న యౌవనం, సౌందర్య రూపం సిద్ధించేలా చేస్తాము. ఏక రూపులమైన మాలో నువ్వు నీ భర్తని వరించగలగాలి."

అశ్వి దేవతలు సుకన్య సౌందర్యాన్ని ఆరాధిస్తూ ఆమె వైపు చూపు నిలిపారు. వారి మాట భర్తకు తెలియజేయటానికి ఎంతో ఉత్సాహం కనపరచింది సుకన్య.

చ్యవన మహర్షిని యౌవన రూపునిగా తలచుకుంటూ, భర్తను సమీపించింది సుకన్య.

సుకన్య మాటలు విన్న చ్యవన మహర్షి చిరునవ్వు నవ్వాడు. ఆమెతో బయలుదేరాడు. అశ్వి దేవతలు పెట్టిన నియమం తన భర్త అంగీకరించడం ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని కలిగించింది సుకన్యకి. దివ్యజ్ఞాని, తపోధనుడు అయిన మహర్షి అంగీకారం తెలిపితే, ఏ సందేహాలకు అవకాశం లేదని, ధైర్యం నింపుకుని భర్తని అనుసరించింది సుకన్య.

తమకూ, మహర్షికీ రూపంలో అభేదం ఉండేటట్లుగా దృఢ చిత్తంతో. ఎంతో శ్రద్ధ వహించారు అశ్విదేవతలు. కొలనులో ముగ్గురూ ఒకేసారి దిగారు. అశ్వి దేవతలు తమ వైద్య విద్యను ప్రయోగించారు.

ముగ్గురూ ఒకే రూపంతో కొలను వెడలి వస్తుంటే, సుకన్య వారిని చూస్తూ తన కళ్ళను తను నమ్మలేకపోయింది.

ముగ్గురూ అశ్వి దేవతలే, ముగ్గురిలోనూ విజయగర్వం తొణికిసలాడు తోంది. ముగ్గురూ యౌవనవంతులే. ముగ్గురూ సౌందర్య రూపులే. ముగ్గురూ ఏకాకృతులే.

తన భర్తను సుకన్య పోల్చుకోలేదనే భావం పూర్తిగా అశ్వి దేవతల మనసులో నాటుకుంది.

సుకన్య ప్రశాంత చిత్తురాలై ముగ్గురినీ పరిశీలనగా చూస్తోంది. ఏకాకృతులైన ఆ ముగ్గురినీ చూస్తూ, తన ప్రేమానురాగాలు ఎటు దారి తీస్తాయో అనుకుంటూ, ముందు ముందుకి అడుగు వేస్తోంది సుకన్య.

మరొక్కసారి పరీక్షగా ముగ్గుర్నీ చూసింది సుకన్య. అశ్వి దేవతలు తమకు, మహర్షికీ రూపంలో, యౌవనంలో తేడా లేకుండా చేయగలిగినా, మహర్షికి జన్మతః సిద్ధించి, అంతర్లీనంగా ఉన్న తేజస్సును ఆయన నుంచి వేరు చేయలేక పోయింది.

ఆమెలోని అనిర్వచనీయమైన అనుభూతి ఆ తేజస్సు వైపు ఆకర్షితమవు తోంది. అప్రయత్నంగా ఆమె పాదాలు ఆ తేజోమూర్తి వైపు నడిచాయి.

అశ్వి దేవతలు ఆశ్చర్యంనుంచి తేరుకోలేకపోయారు.

సుకన్యా చ్యవన మహర్షుల అన్యోన్యానురాగం అశ్వి దేవతలని ఆనంద పరవశుల్ని చేసింది. అంతవరకు అమర వైద్యులమని అతిశయం చూపినవారు, తలలు వంచి సవినయంగా మహర్షి దంపతులకు పాదాభివందనం చేశారు.

తనకి యౌవన రూపం కలిగించి, మహోపకారం చేసిన అశ్వి దేవతలకు ప్రత్యుపకారం చేయదలచాడు మహర్షి. యజ్ఞంలో సోమరస భాగం వారికి సిద్ధించేటట్లు చేస్తానని మాట ఇచ్చాడు వారికి. మహర్షి కలిగించిన ప్రత్యేక గౌరవానికి సంతసిస్తూ, గగన మార్గాన తరలిపోయారు అశ్వి దేవతలు.

నవయౌవనుడైన భర్త చ్యవనుని పరిష్వంగంలో పరవశించింది సుకన్య.

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం:
అరణ్య పర్వం : తృతీయాశ్వాసం)
(ప్రచురణ: ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక : 8-6-1988)